పాలికల్చర్‌తో లాభాల పంట

- ఆక్వా రైతులకు వరంగా మారిన పాలికల్చర్
- రొయ్యలు, చేపల మిశ్రమ పెంపకంపై ఆసక్తి
- వరుస నష్టాల నుంచి గట్టెక్కుతున్న వైనం


పాలికల్చర్ సాగు చేస్తున్న చెరువులు

తాళ్లరేవు: వరుస నష్టాలతో సతమతమవుతోన్న ఆక్వా రైతులకు పాలికల్చర్ వరంలా మారింది. పాలికల్చర్‌లో పెట్టిన పెట్టుబడికి ఢోకా లేకపోవడంతో అధిక శాతం మంది ఆక్వా రైతులు రొయ్యలు, చేపల మిశ్రమ పెంపకం(పాలికల్చర్)పై దృష్టి సారిస్తున్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని అధికంగా ఆర్జించి పెడుతున్న ఆక్వారంగంపై ప్రభుత్వం సైతం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాలికల్చర్ బాగా విస్తరిస్తుంది.

ఆక్వాకు ప్రభుత్వ సహకారం

లక్షలాది రూపాయల వ్యయంతో సాగుచేసే రొయ్యల పెంపకంలో ఏదైనా తేడా జరిగితే భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చేది. అయితే పాలికల్చర్ రాకతో కొంతమేర పరిస్థితి మెరుగైంది. పాలికల్చర్‌లో చేపల విక్రయం ద్వారా పెట్టిన పెట్టుబడి రావడంతో పాటు రొయ్యలు పంట పడితే రైతులు భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. అందుకే క్రమంగా పాలికల్చర్ సాగుపై ఆక్వా రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేస్తుండడంతో రైతులు పాలికల్చర్ చేసేందుకు ముందుకొస్తున్నారు. ముఖ్యంగా ఆక్వారంగానికి ప్రభుత్వమిచ్చే విద్యుత్ రాయితీతో అధిక శాతం మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. రొయ్యలు, చేపల పెంపకానికి సంబంధించి వేసే విత్తనం(సీడు) మొదలుకొని, వాటికి అందించే మేత, ఇతర నీటి యాజమాన్య ఉత్పత్తులపై కూడా ప్రభుత్వం సహకారమందిస్తుండడంతో ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులకు భారీ డిమాండ్

చెరువుల లీజులు ఆక్వా రైతులకు దడ పుటిస్తున్నాయి. రొయ్యల పెంపకానికి అనువుగా ఉండి విద్యుత్ సౌకర్యం గల చెరువులకు గతంలో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు లీజు ఉండేది. అది ప్రస్తుతం రూ.లక్ష పైమాటే. కాగా రొయ్యలు, చేపల సాగుకు అనువైన భూములకు విద్యుత్ సౌకర్యం లేకపోతే ఎకరాకు రూ.20 వేల నుంచి 30 వేల వరకు ఉండేది. అయితే అది కాస్తా భారీగా పెరిగి రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు లీజు పలుకుతోంది. దీంతో ఆక్వా కల్చర్ సాగుకు అనువైన చెరువులకు భారీగా డిమాండ్ పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో సాగు చెరువులు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయ భూములను చెరువులుగా మార్చేస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు పండే భూముల్లో సైతం చెరువులు తవ్వేందుకు వెనుకాడడం లేదు.


చేపలను తూకం తూస్తున్న ఆక్వా రైతులు

ఆక్వా రైతులకు ఊపిరి పోసింది



నష్టాల బారినపడుతున్న ఆక్వా రైతులకు పాలికల్చర్ ఊపిరి పోసింది. చేపలు, రొయ్యలు మిశ్రమ పెంపకం (పాలికల్చర్) విధానం ఒక వరంలా పరిణమించింది. ప్రభుత్వం సైతం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో అధిక శాతం మంది పాలికల్చర్ చేసి లాభాల బాట పట్టారు.

– కొప్పిశెట్టి వెంకట్, ఆక్వా రైతు, శాంతిమూల గ్రామం, పటవల పంచాయతీ

నష్టాల నుంచి లాభాల్లోకి



వరుస నష్టాలతో తిరోగమనం వైపునకు వెళుతున్న ఆక్వా రైతులు పాలికల్చర్‌తో లాభాల బాటలోకి పయనిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో ఎక్కువ శాతం మంది పాలికల్చర్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చేపలు, రొయ్యలు కూడా సమాంతరంగా పెరగడం, వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉండడంతో లాభాలు వస్తున్నాయి.

– మందాల సత్యనారాయణ, ఆక్వా రైతు, ప్రత్తిగొంది

ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరందించడమే లక్ష్యం

ముమ్మిడివరం: ప్రజలందరికి స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటుచేస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో జలజీవన్ మిషన్ నిధులు రూ.79 లక్షలతో ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో కలిసి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తూ ,గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, నడింపల్లి సూరిబాబు, కాట్రేనికోన జెడ్పీటీసీ నేల కిశోర్, ఎంపీటీసీ సభ్యురాలు గొలకోటి వీరహనుదుర్గ పద్మజ, గొలకోటి రాజబాబు, గ్రామ సర్పంచ్ గొలకోటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- భీమనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భీమనపల్లిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రతిఒక్కరికీ పార్టీలకు అతీతంగా న్యాయం జరుగుతుందన్నారు. నాడు టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. నేడు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలనగా జగనన్న పరిపాలిస్తున్నారని చెప్పారు. గడప గడపకూ కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న భట్టుపాలెంకు చెందిన చీకట్ల ముత్యాలరావును డాక్టర్ శ్రీకాంత్ పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, శిరంగు రాజా, ఆకేటి సత్యవిష్ణు, రాయపురెడ్డి నాగు, యాళ్ల చిన్నా తదితరులు పాల్గొన్నారు.


భీమనపల్లిలో సంక్షేమ వివరాలను లబ్ధిదారుకు అందిస్తున్న పినిపే శ్రీకాంత్ తదితరులు

భాషలన్నింట్లో తెలుగుకు ప్రత్యేక స్థానం

ముమ్మిడివరం: ప్రపంచ భాషల్లో దేనికి లేని ప్రత్యేకత తెలుగు భాషకు ఉందని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పచ్చిమాల శివనాగరాజు అధ్యక్షతన కవి పుణ్యమంతులు అర్జునరావు రచించిన 'పార్థు శతకం' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. శతావధాని జానా దుర్గా మల్లిఖార్జునరావు, డా.గూటం స్వామిలు శతక సమీక్ష చేశారు. పలు సామాజిక సమస్యలు, వాటికి సమాధానాలు తమ రచనలో వెల్లబుచ్చిన కవి అర్జునరావును పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాశి వీర వెంకట సత్యనారాయణ, ఎల్లమిల్లి రాంజీ, నక్కా మహేష్, వేటుకూరి సుబ్బరాజు, నల్లా బాలరాజు, ఎస్.అబ్బులు పాల్గొన్నారు.


పార్థు శతకం పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న కవులు

ఆడపిల్లలు చదువు కొనసాగించాలి

అల్లవరం: ఆడపిల్లలు పదో తరగతి తర్వాత విద్యను ఆపకుండా చదువుకోవాలన్న సదుద్దేశంతో ప్రతి మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ తరగతులను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సోమవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన అల్లవరం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు–నేడు పథకంతో పాఠశాలల్లో తొమ్మిది రకాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే అన్నారు. మధ్యాహ్న భోజన పథకం, జగనన్న గోరుముద్ద ద్వారా వారానికి ఐదు గుడ్లు, మూడు రోజులు చిక్కీలు, మూడు రోజులు రాగి మాల్టు, శనివారం స్వీట్ పొంగల్‌లతో ప్రతిరోజూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. విద్యా కానుక, అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతి తదితర పథకాల ద్వారా రాష్ట్రంలో విద్యారంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ బొమ్మి బాలవేణి, ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మౌనిక, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంఈఓ కిరణ్ బాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దాసం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


హైస్కూల్ ప్లస్ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక తనిఖీ బృందాలు

అమలాపురం రూరల్: మిషన్ వాత్సల్య అమలులో భాగంగా జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు వివిధ శాఖల సిబ్బందితో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురంలోని పలు బేకరీ, కిరాణా దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై ప్రత్యేక తనిఖీ బృందాలు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేసి వాటిలో పనిచేస్తున్న పిల్లల వయసుపై ఆరా తీశాయన్నారు. వారి తల్లిదండ్రుల్ని పిలిపించి వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు వివరించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, 14 సంవత్సరాలు దాటని పిల్లల చేత పనిచేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల అంతా బాలకార్మికుల తనిఖీలు జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేక తనిఖీ బృందాల్లో కార్మిక అధికార్లు, ఐసీడీఎస్, పోలీస్, విద్యాశాఖ అధికారులు పాల్గొంటున్నారని నాగలక్ష్మి తెలిపారు.


టి.నాగలక్ష్మి, సహాయ కార్మిక కమిషనర్

సీబీవీ పాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ ఆకస్మికంగా దగ్ధమైంది. జనావాసాల చెంత మార్కెట్ ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మత్స్యకార గ్రామాలైన చినబొడ్డు వెంకటాయపాలెం, పెద బొడ్డు వెంకటాయపాలెంల్లో అంధకారం అలుముకుంది. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదంపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటీన అక్కడకు చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్ మార్చే పనులను ప్రారంభించారు.

యానాంలో జిప్‌మెర్ డైరెక్టర్ పర్యటన


యానాం: యానాంలో ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టుగాడ్యుయేట్ మెడికల్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) యూనిట్ నిర్మాణం దాదాపుగా పూర్తయిన నేపథ్యంలో ఆసుపత్రి ప్రారంభోత్సవం తదితర విషయాలపై చర్చించేందుకు పుదుచ్చేరి జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ సోమవారం యానాం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన జిప్‌మెర్ ఆసుపత్రిని ఆర్‌ఏఓ మునిస్వామి, వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 31కల్లా ఆసుపత్రిని జిప్‌మెర్‌కు అప్పగించాలని ఆదేశించారు. పుదుచ్చేరి సీఎంఓ ఆఫీసుకు సంబంధించి నివేదికను అందజేయాలని కోరారు. అనంతరం పంపేట పార్క్‌లో రాకేష్ అగర్వాల్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో సీపీడబ్ల్యూడీ ఈఈ కృష్ణకిషోర్, ఏఈ డి.లక్ష్మయ్య, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

అమలాపురం టౌన్: పరిసరాలను పచ్చదనంతో నింపి పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో సోమవారం ఉదయం జరిగిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉద్యానవనంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావుతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షులు మోకా వెంకట సుబ్బారావు, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, మేడిచర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలను పచ్చదనంతో నింపుదాం

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ మహిళా భాగస్వామి కావాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద పట్టణ మహిళలకు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమలాపురం మున్సిపాలిటీలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటైన ర్యాలీని ప్రియంవద ప్రారంభించి ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. పట్టణంలో ప్రతీ మహిళా హోం కంపోస్టు తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు ఇళ్ల వద్దే నుంచి శ్రీకారం చుట్టాలని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పర్యావరణ అవగాహన ర్యాలీ మొదలై గడియారం స్తంభం సెంటరు వరకూ కొనసాగింది. మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మంగాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎ.దేవకి, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.


ఉద్యానవనంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత

తాళ్లరేవు: పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యత అని పలువురు వక్తలన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోరంగి అభయారణ్యంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్(లైఫ్) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగం ద్వారా అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. అభయారణ్యంలో శివన్నారాయణ, సామ్యూల్ సాగర్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ టి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, నాయకులు బూరెల వెంకట్రాజు, జి.లక్ష్మీనారాయణ, పోతుల రత్నకుమారి, కాపవరపు శ్రీదేవి, స్వర్ణ రాజు, మృత్యుంజయరావు, ఎం.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్

అమలాపురం రూరల్: కామనగరువులో స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు కుంచే స్వర్ణలత మహిళలకు జ్యూట్ బ్యాగులు, న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్స్ పంపిణీ చేశారు. స్థానిక భట్లపాలెం బీవీసీ ఐటీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులకు బ్రహ్మకుమారి రాజేశ్వరి అవగాహన కల్పించారు. ఎ.వేమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తేజస్విని ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ చైర్మన్ టి.రమాతేజస్విని తదితరులు మొక్కలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఐదుగురు

అమలాపురం టౌన్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన కోనసీమ జిల్లా లిఫ్టర్లకు స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో సోమవారం ఉదయం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అమలాపురం, ముమ్మిడివరం ప్రాంతాలకు చెందిన అయిదుగురు పవర్ లిఫ్టర్లు మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. అమలాపురానికి చెందిన లిఫ్టర్లు ఎం.వీరేంద్ర, వి.వీరబాబు, పి.వందన, ముమ్మిడివరానికి చెందిన ఎం.శ్రేయ, ఏవీవీ సత్యనారాయణలు జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపిక అయ్యారు. ఈ అయిదుగురు క్రీడాకారులను స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అభినందించారు. జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పవర్ లిఫ్టింగ్ టీమ్ కోచ్ ఎంవీ సముద్రం, టీమ్ మేనేజర్ వి.నరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం గ్రామ పంచాయతీకి చెందిన బొక్కా సత్యన్నారాయణ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు రెండు బస్తాల బియ్యాన్ని సోమవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు మరో రూ.5 వేలు అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

వీరేశ్వరుని కల్యాణం మహిమాన్వితం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం మహిమాన్వితమైనదని, ఇక్కడ కల్యాణం జరిపించుకుంటే కోరిన కోరికలు తీరతాయని హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు, నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ అన్నారు. సోమవారం ఆయన ఆలయ ప్రాంగణంలో శివలీలామృతం, పురాణ విజ్ఞానంపై భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకస్వాములు, చైర్మన్ పెన్మత్స వాసు రాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

యానాంలో 14 నుంచి పాఠశాలలు ప్రారంభం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఈ నెల 7 నుంచి ప్రారంభించాల్సిన పాఠశాలలను ఈ నెల 14 నుంచి తెరిచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రంగసామి వెల్లడించారు. యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో వేసవి ఎండ వేడిమి అధికంగా ఉందని చిన్నారుల శ్రేయస్సు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మోటారు సైకిల్ చోరీ

ముమ్మిడివరం: ఇంటి వద్ద పెట్టిన మోటారు సైకిల్ అపహరణకు గురైన ఘటన ముమ్మిడివరంలో చోటుచేసుకుంది. ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌కు చెందిన పసుమర్తి రామనాగ సత్యనారాయణగుప్త గత నెల 31 రాత్రి తన యాక్టివా మోటారు సైకిల్‌ను ఇంటి వద్ద పెట్టి తాళం వేయగా దొంగలు అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు.

వ్యక్తి మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి నదీపాయలోని ఊబిలో కూరుకుపోయి మాతా బాలకృష్ణ(39) అనే వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాళ్లరేవు పెంకేవారిపేట గ్రామానికి చెందిన బాలకృష్ణ సమీపంలోని ఆత్రేయ గోదావరి నదీపాయలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ నదిలో పడి ఊబిలో కూరుకుపోయి మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసకుమార్ తెలిపారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్: అంబాజీపేట మండలం వక్కలంక గ్రామానికి చెందిన దారా ఆనందరావుపై దాడి చేసిన అంబాజీపేట ఎస్సై చైతన్యకుమార్, సీఐ ప్రశాంత్‌కుమార్‌లపై సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత ప్రజా సంఘాలు, దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. భూమి వివాదంలో అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన ఆనందరావును పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఆత్మహత్య ప్రయత్నానికి కారకులయ్యారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డీబీ లోక్ కన్వీనర్ జంగా బాబురావు, కొంకి రాజమణి, రేవు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

ముమ్మిడివరం: తన బావ మరిదిని ఆరుగురు వ్యక్తులు కొడుతుండగా అడ్డుకున్నందుకు తనపై, తన భార్యపై వారు దాడి చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఖాతాపై అవగాహన

అల్లవరం: గూడాల గ్రామంలో సోమవారం వన జన ధన కార్యక్రమంలో భాగంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఖాతా, రికరింగ్ డిపాజిట్లపై ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మహిళలు, బాలికల కోసం ప్రత్యేక పొదుపు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టిందని అమలాపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ అన్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ మహిళల ఆర్థిక ప్రయోజనాలను ఉద్దేశించి ప్రారంభించారన్నారు. వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఖాతాను దగ్గరలో ఉన్న పోస్టాఫీస్‌లో తెరవొచ్చని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎన్‌వీ లక్ష్మి, బసవా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టి -12 సూపర్ లీగ్ టోర్నీ ప్రారంభం

యానాం: యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టి–12 సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మ్యాచ్‌లను యానాం వ్యాయామ ఉపాధ్యాయులు ప్రారంభించారు. 12 ఓవర్ల చొప్పున జరుగుతున్న ఈ టోర్నమెంట్ మొదటి మ్యాచ్‌లో అగ్ని లయన్స్, కేవీఆర్ జట్లు తలపడగా అగ్ని లయన్స్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అంబేద్కర్ లెవెన్స్ జట్టు నాగా లెవెన్స్ జట్టుపై గెలుపొందింది. రామాయూత్‌–ఏ జట్టు, సీ సోల్జర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సీ సోల్జర్స్ జట్టు విజయం సాధించింది. కేఎఫ్‌సీసీ జట్టు, గ్లాడియేటర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేఎఫ్‌సీసీ గెలుపొందింది.

స్కూల్ వాచ్‌మన్ నిజాయతీ



యానాం: యానాం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ వాచ్‌మన్ రామాడి నూకయ్య స్థానిక ఏటీఎంలో రూ.1,000 నగదు డ్రా చేసేందుకు ప్రయత్నిస్తే ఏటీఎం మిషన్ నుంచి రూ.10,000 వచ్చింది. దీంతో నూకయ్య తన సొమ్ము వెయ్యి తీసుకుని మిగిలిన రూ.9 వేలును బ్యాంకు యాజమాన్యానికి అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. నూకయ్యను బ్యాంకు సిబ్బంది, టీచర్ ముమ్మిడి చిన్నారి తదితరులు అభినందించారు.

మాదిగలకు అసెంబ్లీ సీటివ్వాలి

అమలాపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ జిల్లాలోని మూడు రిజర్వుడు అసెంబ్లీ స్థానాల్లో ఒక అసెంబ్లీ సీటు మాదిగలకే ఇవ్వాలని బాబూ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మాదిగల రాజకీయ జేఏసీ జిల్లా కన్వీనర్ తొత్తరమూడి ప్రభాకరరావు అధ్యక్షతన నడిపూడి జగ్జీవన్ రామ్ భవన్లో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్ర్యం వచ్చాక 75 ఏళ్లలో ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మాదిగలను గౌరవించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరైతే మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తారో ఆ పార్టీకే ఓట్లు వేస్తామని సమావేశంలో నాయకులు హెచ్చరించారు. సమావేశంలో కాప నాగభూషణం, సెక్రటరీ చెట్ల సత్యనారాయణ, మంద వెంకటేశ్వరరావు, మోకాటి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి వాలీబాల్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థిని అడబాల లక్ష్మి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్టు పీడీ గొలకోటి ఫణీంద్ర సోమవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి భోపాల్‌లో జరిగే అండర్–19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పీడీ ఫణీంద్ర చెప్పారు. గొల్లవిల్లి సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు విద్యార్థినికి స్పోర్ట్స్ కిట్ బహూకరించి అభినందించారు.